


ఇది కదా అభివృద్ధి

- మురళీనగర్ పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- రూ.10 లక్షలతో జిమ్ పరికరాలు
- వాకర్స్, సందర్శకులతో కళకళ
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

బృందావన్ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు

ఆరోగ్యానికి జిమ్‌దాబాద్

ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యం మెరుగుపడేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఇందులో భాగంగా పార్కులను అభివృద్ధి చేయడంతోపాటు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇవి ఎంతగానో దోహదపడుతున్నాయి.

మురళీనగర్: జీవీఎంసీ 49, 50 వార్డులు అందమైన.. ఆహ్లాదకరమైన పార్కులకు ప్రసిద్ధి. మురళీనగర్ పరిసరాల్లో 11 పార్కులు ఉన్నాయి. ప్రతి ఉద్యానవనం ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది. సందర్శకులకు అవసరమైన సౌకర్యాలతో పార్కులన్నీ అలరారుతున్నాయి. పచ్చదనంతో పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో పార్కులు ఉదయం, సాయంత్రం సందర్శకులతో కళకళలాడుతుంటాయి. ఇక్కడికి వచ్చిన వారికి ఆరోగ్యం గ్యారంటీ అనే విధంగా పార్కులను అభివృద్ధి చేశారు. పార్కుల నిర్వహణ సంఘం సభ్యులతోపాటు, జీవీఎంసీ నిధులతో వీటిని సందర్శకులకు అనుకూలంగా తీర్చిదిద్దారు. పార్కుల్లో ఆట మైదానాలను ఏర్పాటు చేశారు. వీటికి తోడు వ్యాయామం చేసుకోవడానికి పరికరాలు ఉంటే మరింత బాగుంటుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆలోచించింది.



వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న స్థానికులు

నడకతో ప్రారంభమై..

మురళీనగర్‌లో ఏ పార్కు చూసినా వాకర్స్‌తో కనిపిస్తుంది. పిల్లల నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు పార్కుల్లో నడక కోసం ఉదయం, సాయంత్రం వస్తుంటారు. వందలాది మంది పురుషులు, మహిళలు పార్కుల్లో నడక మంత్రాన్ని పాటిస్తారు. ప్రతి రోజూ కనీసం 45 నిమిషాలు నడిచిన తర్వాత చిన్నపాటి వ్యాయామాలు చేస్తేనే మంచి ఉపయోగం ఉంటుంది. ఇందుకోసం జిమ్‌లకు వెళ్లాలంటే పైసలతో పని. అందుకే జీవీఎంసీ అధికారులు ప్రతి పార్కులోనూ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. మురళీనగర్‌లోని పలు పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేశారు.



హరిత పార్కులో ఓపెన్ జిమ్



బృందావన్ పార్కు ప్రవేశ ద్వారం

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు, హరిత పార్కు, వైభవ్ పార్కు, బృందావన్ పార్కుల్లో అన్ని వయసుల వారికి ఉపయోగపడేలా వివిధ రకాల జిమ్ పరికరాలను అందుబాటులో ఉంచారు. దీంతో నడిచిన చోటే వ్యాయామ చేసుకునే వీలు కలిగింది. దీనిపై వాకర్స్, సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పార్కుల్లో ఉత్సాహంగా వ్యాయామం



చేతులు, కాళ్ల జాయింట్‌లు బలపడాలంటే ప్రత్యేకంగా ట్విస్టర్స్ ఉన్నాయి. వీటితో రోజూ 15 నిమిషాల వ్యాయామం చేస్తే సరిపోతుంది. గతంతో ఆడవాళ్లకు, ముఖ్యంగా గృహిణులకు వ్యాయామం చేయడానికి పరికరాలు అందుబాటులో ఉండేవి కాదు. **ఇప్పుడు పార్కుల్లోనే పరికరాలు ఉండటంతో ఉత్సాహంగా వ్యాయామం చేస్తున్నాం.**

– జి.పద్మ, మురళీనగర్

మా కృతజ్ఞతలు



చక్కని శరీర సౌష్టవానికి నడుము సన్నగా ఉండాలి. ఇందుకోసం వ్యాయామం చేయాలంటే ప్రత్యేక పరికరాలు అవసరం. వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఇవి అందుబాటులో ఉన్నాయి. నడుము, ఇతర అవయవాలు సరైన పోశ్చర్‌లో ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలి. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసినందుకు మా కృతజ్ఞతలు.

– ఎం.భానుప్రకాష్, మురళీనగర్ సెక్టార్–4

ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు



ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జగనన్న ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. పిల్లలను ప్రత్యేకంగా జిమ్‌లకు తీసుకెళ్లడం సాధ్యం కాదు. వాకింగ్‌కి వచ్చినప్పుడు ఇలా కళ్ల ఎదురుగా జిమ్ పరికరాలు కనిపించడం వల్ల వారికి వ్యాయామం చేయాలనే ఆసక్తి పెరుగుతుంది. చిన్నపిల్లలు వ్యాయామం చేయడానికి కూడా పరికరాలు ఏర్పాటు చేశారు.

– సీపాన రాము, తెన్నేటినగర్

క్లుప్తంగా

రూ.39 లక్షలతో అభివృద్ధి పనులు



44వ వార్డులో పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు రామచంద్రానగర్ మాదేటి గార్డెన్స్‌లో రూ.39 లక్షలతో బీటీ రోడ్లు, పలు అభివృద్ధి పనుల కోసం శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావుతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, డీఈ భరణి, ఏఈ రవణమ్మ, స్థానిక నాయకులు హబీబ్, తాతారెడ్డి, కృష్ణారావు, శ్రీనివాస్, ఎం.గోపి, తిరుపతి, ముస్తఫా, బషీర్, ప్రసాద్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ జగనన్ననే గెలిపించుకుందాం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పైడి రమణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు 255 సచివాలయం పరిధి క్లస్టర్–18లోని రామచంద్రనగర్‌లో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, సచివాలయ కన్వీనర్ పైడి రమణ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందుకుంటున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ఆయననే గెలిపించుకోవాలని ప్రజలను పైడి రమణ కోరారు. కార్యక్రమంలో వలంటీర్ లక్ష్మి, గృహసారథులు పలిశెట్టి గణపతి, మంగ, పార్టీ నాయకులు ముప్పిడి రామారావు, నేపాల్ శ్రీను, వెంకన్న, దుర్గేష్, నాయుడు, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

31న రెడ్డి కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం

సీతమ్మధార: వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ ఆదివారం ముడసర్లోవ రోజ్ గార్డెన్స్‌లో రెడ్డి కుటుంబాల ఆత్మీయ సమ్మేళన వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు నీలాపు వివేకానంద రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పలు కార్యక్రమాలు, పిల్లలు, మహిళలకు ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షో, తంబులా, ప్రతిభ గల విద్యార్థులకు అతిథులచే స్కాలర్‌షిప్, పోటీల విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. వివరాలకు 90306 55681 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దళిత విముక్తి ప్రతిఘటనా సదస్సు రేపు



నినాదాలు చేస్తున్న వెంకటరమణ తదితరులు

సీతమ్మధార: దళిత విముక్తి 25 ఏళ్ల ఉద్యమ ప్రస్థాన నేపథ్యంలో ఈ నెల 17న ప్రతిఘటనా సదస్సు, ర్యాలీ నిర్వహిస్తున్నామని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు సదస్సుతో పాటు సాయంత్రం 4 గంటలకు సభా స్థలం నుంచి ఎల్‌ఐసీ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బి.అప్పారావు, జి.డి.సారయ్య, బి.రామకృష్ణ, బి.సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి



54వ వార్డులో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ రజని



25వ వార్డులో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, గోవింద్

సీతంపేట: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో 133 సచివాలయం పరిధి బీటీఆర్ కాలనీ వద్ద, 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజని, ఈశ్వరరావు ఆధ్వర్యంలో 304 సచివాలయం పరిధి పాత ఐటీఐ జంక్షన్ వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన అభివృద్ధి, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారులను ఉద్దేశించి కె.కె.రాజు మాట్లాడుతూ 2024లో మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షులు జి.వి.రమణి, కృష్ణారావు మాస్టర్, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ మురళీకృష్ణారెడ్డి, అమర్‌రెడ్డి, 25, 54 వార్డు నాయకులు కె.చిరంజీవి, సానబోయిన సురేష్, బోగవిల్లి గోవింద్, హరికృష్ణ, రాధాకృష్ణ, కల్యాణ్, నూకరత్న, శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అందరికీ మేలు

జీవీఎంసీ 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో 132 సచివాలయం పరిధి మధురానగర్‌లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ముందుగా సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాలతో కూడిన డిజిటల్ బోర్డు ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ జి.వి.రమణి, సచివాలయం కన్వీనర్లు వీరమ్మ, కోటి, వానపల్లి లక్ష్మణకుమార్, యూత్ అధ్యక్షుడు ఉప్పాడ సన్నీ, శంకర్, పార్టీ కార్యకర్తలు, మహిళలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు

మర్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పేర్కొన్నారు.

వార్డులోని 293 సచివాలయం పరిధి తెన్నేటినగర్ వద్ద శుక్రవారం జరిగిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. అనంతరం ఆయన పథకాల డిజిటల్ బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు బాగాది విజయకుమార్, స్థానికులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మధురానగర్‌లో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గోవింద్, రమణి



50వ వార్డులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ ప్రసాద్



51వ వార్డులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

ఇంటింటా పథకాలపై అవగాహన

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని 51వ వార్డు కార్పొరేటర్, సచివాలయం కన్వీనర్ రెయ్యి వెంకటరమణ కోరారు. వార్డులోని 289 సచివాలయం పరిధి కళింగనగర్ వద్ద శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న పథకాల గురించి కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. వలంటీర్లు కుమారి, యశ్వంత్, విజయ, యమున, వైఎస్సార్‌సీపీ కార్యకర్త గణేష్, స్థానికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్



విన్యాస ప్రదర్శనలో కేవీ వాల్తేర్ విద్యార్థులు

- డీఆర్‌ఎం, కేవీ ఛైర్మన్ సౌరభ్ ప్రసాద్
- ఘనంగా కేంద్రీయ విద్యాలయ ఆవిర్భావ దినోత్సవం

తాటిచెట్లపాలెం: నేటి సమాజంలో చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయని డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం), కేవీ వాల్తేర్ చైర్మన్ సౌరభ్ ప్రసాద్ అన్నారు. తాటిచెట్లపాలెం పోర్ట్ గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ ఎదురుగా గల కేంద్రీయ విద్యాలయ వాల్తేర్ ఆవిర్భావ దిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముందుగా అలుమ్ని సభ్యులు సమకూర్చిన వ్యాయామ వేదికను అలుమ్ని సభ్యులు, కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయ ఆవిర్భావం, చరిత్రను గురించి వివరించారు. డిసెంబర్ 15న దేశవ్యాప్తంగా సుమారు 1,250 కేంద్రీయ విద్యాలయాలు వ్యాప్తి చెందడమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా కూడా విస్తరించి ఉన్నాయన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ విద్యార్థులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడారు. కేవీ విద్యార్థులు పలు క్రీడల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థులు, యోగా, జిమ్నాస్టిక్స్, శాస్త్రీయ సంగీతం, ఏరోబిక్స్, నాట్యం, వంటి పలు ప్రత్యేక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మీన్స్, పీటీ టీచర్ రియాజ్‌ఖాన్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వి.ఎం.శైలజ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రాణి, గిరి, గీత, సబ్రీన్, త్యాగరాజు, రేఖ, విజయలక్ష్మి, నాగమణి, కుందన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం వ్యాక్సినేషన్ లక్ష్యం

మురళీనగర్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నూరు శాతం వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించాలని సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. మాధవధార సచివాలయం, మురళీనగర్–02 సచివాలయం, చంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆరోగ్యశ్రీ అవగాహన సదస్సుల నిర్వహణ, ఆర్‌సీహెచ్ ఇండికేటర్స్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనుష్ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు అందరికీ అందించేందుకు ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని వైద్యులు, ఏఎన్‌ఎంలను ఆదేశించారు. చంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పిల్లలకు వ్యాధినిరోధక టీకాల ప్రగతిని సమీక్షించి ఫార్మసీ పరిస్థితిని పరిశీలించారు. వ్యాక్సిన్ పొటెన్సీ మెయింటైన్ చేయాలని సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులతోపాటు, స్టాఫ్ నర్స్, ఆశా వర్కర్లు డ్రెస్ కోడ్ పాటించాలని ఆదేశించారు. గర్భిణు(ఏఎన్‌సీ)లను గుర్తించి టీటీ అందజేయాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్స్ సలహా మేరకు ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది సందర్శనకు వెళ్లినప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి పాల్గొన్నారు.



చంద్రనగర్ ఆరోగ్య కేందంల్రో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

విద్యుత్ ఆదా అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఈఈ బి.కె.నాయుడు



పాల్గొన్న పొదుపు సంఘాల మహిళలు

మురళీనగర్: విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, దీని వల్ల భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు అన్నారు. ఇంధన పొదుపు సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మురళీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి పొదుపు సంఘాల మహిళలకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఈడీ బల్బులు వాడడం వల్ల 50 శాతం విద్యుత్ ఆదా చేయవచ్చని, బీఈఈ 5స్టార్ విద్యుత్ పరికరాలు వాడాలని, అవసరం లేనప్పుడు ఫ్యానులు, లైట్లు, టీవీలు ఆపాలని, మొబైల్ చార్జి పూర్తయిన వెంటనే ప్లగ్‌లు తొలగించాలని, ఏసీలను 24 డిగ్రీల వద్ద ఉంచాలని, ఇంటి లోపలి గోడలకు లైట్ కలర్స్ వేసుకోవాలని, రిఫ్రిజిరేటర్లకు రబ్బర్ సీళ్లు మార్చాలని సూచించారు. ఎనర్జీ కన్జర్వేషన్ సీజీఎం వో.సింహాద్రి, ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ మహిళలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. సహజ వనరుల పరిరక్షణకు ఇంధన పొదుపు చాలా అవసరమవుతుందని వారు చెప్పారు.

18న సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవం



సీతంపేట: శ్రీబాలమురుగన్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక పార్వతీశ్వరాలయంలో ఈ నెల 18న బాల సుబ్రహ్మణ్యస్వామి షష్టి మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు భాస్కరశర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 17వ తేదీ ఉదయం 7 గంటలకు మంగళస్నానాలు, 18వ తేదీ ఉదయం 5 గంటలకు 108 క్షీర కలశాలతో అభిషేకం, అనంతరం వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు 108 దీప కలశాలతో స్వామి వారి ఊరేగింపు ఉంటుందని చెప్పారు. 19వ తేదీ ఉదయం 9 గంటలకు సుబ్రహ్మణ్య స్వామి పూర్ణాహుతి హోమం జరుగుతుందని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన దలచిన భక్తులు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

బాక్సింగ్ పోటీలకు ఆహ్వానం

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19, 20, 21 తేదీల్లో బీచ్ రోడ్డులోని వైఎంసీఏ వద్ద బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీలకు ముఖ్య అతిథిగా రావాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుకు శుక్రవారం అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ ఎం.ఎస్.ఎస్.శ్రీనివాస్ ఆహ్వానం పత్రం అందించారు. యూత్ నాయకుడు ఎం.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కె.కె.రాజుకు ఆహ్వానం పత్రం అందిస్తున్న శ్రీనివాస్

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



సాయిమహేష్

మర్రిపాలెం: ఒక యువకుడి అదృశ్యంపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా. మురళీనగర్ అయ్యప్పనగర్‌లో చల్లా సాయిమహేష్ అనే యువకుడు తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. ఇతను మూడు నెలల కిందట ఏదో పనిమీద ఇంటి నుంచి వెళ్లాడు. ఇంతవరకు తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు తెలిసిన వారి ఇళ్లలో గాలించినా ఫలితం లేకపోయింది. యువకుడి తండ్రి నాగేశ్వరరావు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ వై.ప్రకాశరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ఉద్యోగినుల కోసం రెస్ట్‌రూమ్ ప్రారంభం



రెస్ట్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో పనిచేసే మహిళా సిబ్బంది కోసం ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై నిర్మించిన ఆధునిక రెస్ట్‌రూమ్‌ను శుక్రవారం ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, ఇతర సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాల్తేర్ డివిజన్ పరిధిలో పనిచేసే మహిళలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, వారికనుకూలమైన వాతావరణం, సుహృద్భావ, సురక్షిత సదుపాయాలను కలుగజేస్తుందని తెలిపారు. నూతన రెస్ట్‌రూమ్‌లో ఆకర్షణీయ ఇంటీరియర్స్, అనువైన సీటింగ్ సదుపాయాలు, అందమైన లైటింగ్, టాయ్‌లెట్స్, సురక్షిత తాగునీరు వంటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈకార్వో వైస్ ప్రెసిడెంట్స్ కవితా గుప్తా, మధుమిత సాహూ, సెక్రటరీ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.